• సంఘ దురాచారం! •

అంగర వెంకటకృష్ణారావుగారు

"అన్నయ్యా! రావూ? మనమిద్దరం బొమ్మలు పెట్టుకొని ఆడుకుందాం? ఇవాళ అమ్మని అడిగి ఎక్కువగా పప్పూ అవీ తెచ్చా, రావూ? రావుకదూ...పోనీలే!" అని అతిదీనంగా అడుగుతూవచ్చేది మా రాజు. అసలు రాజుకీ మాకూ ఏమీ బంధుత్వం లేనేలేదు. చిన్నప్పటినుంచీ ఒకయింట్లో ఉండడంచేతా, ఆస్నేహాతిశయంచేతా నన్ను 'అన్నయ్యా' అని అతి ముద్దుగా పిలిచేది, పిలుస్తున్నాదికూడాను. రాజు నా కంటె కొన్ని సంవత్సరాలు చిన్న, రెండో ఒకటో. మే మిద్దరం ఎన్నడూ ఒకర్ని విడిచి ఒకరం ఉండలేకపోయేవాళ్లము. సాధారణంగా వాళ్లింట్లోనేనో, మాయింట్లో రాజమ్మో భోజనం చెయ్యడంకూడా సంభవించేది. మొత్తానికి మాయిద్దరి హృదయాల్నీ,స్నేహమనే బలవత్తరమైన తీగకలిపి కట్టివేసింది... అది సోదరసోదరీప్రేమ.

రాజు రాజవదన. మేమిద్దరంకలిసి ఆడుకొనే రోజులలో, రాజు ముఖముమీద సర్వదా చిరునవ్వు తాండవించేది. సంస్కారంలేకపోయినప్పటికీ ఆమె ముంగురులు విశాల ఫాలభాగంమీద నవీనకాంతులీనుతూంటే 'మత్తపుష్పంధయవేణి' అన్న ప్రయోగం స్ఫురించేది. నవ్విందంటే, పాలబిళ్ళలలాంటి చెక్కిళ్లు చిరుగుంటలుపడేవి. ఆమె పెదవులు సన్నని పండుదొండలా రక్తిమతో ఉండేవి. ఆమె మాటలాడిందంటే, నోటిలోంచి జారేవి మాటలో ముత్యాలో తెలిసేదికాదు. ఆమె పలువరుసతీర్చి దిద్దిన ముత్యాల ముగ్గుమల్లే ఉండేది. ఆమె మృదు కరనఖములు గోరింట లేకుండానే నవ్యరుచి మాల వెదజల్లేవి. మా యింటికొచ్చి గోరు కొనలతో మల్లెలు కోస్తూంటే మల్లెలకాంతి గోళ్లలో జిగేలు మనేది. నేను అప్పుడు చాలాచిన్నవాడినే అయినప్పటికీ రాజుని చూడగానే చేష్టలు దక్కేవాడిని. మా చావిట్లో ఆడుకుంటూంటే ఒకదగ్గిర సావకాశంగా కూచొని రాజమ్మ ప్రతీచర్యా కనిపెట్టి అందులో విశేషం అనుభవించాలనిపించేది. ఆమె ఆడిన ప్రతీమాటా ఆమె పాడిన ప్రతీపాటా కర్ణపర్వంగా వింటూ దానితీపి మత్తెక్కిపోయేటట్టు తిని వెయ్యాలనిపించేది.

ఆమాట తెలియగానే రాజు అంత తరుచుగా రావడం మానేసింది. ఆమెకి సిగ్గుగాబోసు. కాని అది సహజమే. స్త్రీజాతికి వంశపారంపర్యావచ్చే ఆస్తియేమిటి అంటే 'సిగ్గు'అని ఘంటాపథంగా చెప్పవచ్చును. ఎప్పుడైనా ప్రమాదవశాత్తూ కంటపడితే బలవంతాన్న ఆపి మాట్లాడించేవాడిని; 'రాజూ! నావేపుచూస్తావా! అప్పుడే బుద్ధి

యావత్తూ అటు తిరిగిపోయింది కామోసు! ఎంతయినా మనం...' అనే సరికల్లా చటాలున నామాటికి అడ్డొచ్చి, చిరుసిగ్గుతో 'లేదన్నయ్యా! నిన్ను ఈజన్మలో మరచిపోతానా? అది నాశక్యమా? ఒస్తా ఉండు...' అని నెమ్మదిగా సాగిపోయేది. ఆ బాల్యప్రవర్థమాన సౌహార్ద్ర పటిమ అలాంటిదని నాకు బోధపడ్డది. అప్పుడు మా రాజమ్మకి పెళ్లి తలపెట్టేరు. అది నాకు ఒకందుకు విచారకరం, ఒకందుకు సంతోషకరం అయింది. సరి ఇక పెళ్లయిన తరవాత అత్తవారింటికి వెడుతుంది—అదృశ్యం అవుతుంది అని తోచింది. అప్పటికేదో పెద్దక్లాసే చదువుతూండే వాడిని మరి. రాజు అత్తవారింటికిపోతే నాకో పెద్ద నష్టం కలిగిందన్నమాట! కాకపోతే మరేమిటి—మాయిద్దరి హృదయాలనీ కలిపి కడుతూన్న స్నేహలత పటక్కున తెగిపోతుందన్నమాట. నాహృదయం బద్దలైపోయినట్టు కాదూమరి. సోదర సోదరీప్రేమ అనిర్వచనీయమయినది. అనుభవం మీాద, ప్రకృతి దగ్గర నేర్చుకోవలసిన పాఠమేగాని, అది నేటి ఈ అధ్యాపకులెవ్వరూ చెప్పలేరు. మాది, సోదర సోదరీప్రేమ కతీతమైన, కామేతరమైన, దుర్వాంఛా దూరమైన, మరియొక ఉత్కృష్ట ప్రేమ ఏదైనా ఉంటే అదే.

'రాజూ! రాజూ! వెళ్లిపోతున్నావా? రాజమ్మా! ఒక్క మాట. ఉండుండు. రైలొక్కసారి ఆపండి. మా రాజమ్మతో మాట్లాడవలసిన పనుంది. రైలాపరూ' అంటూ ప్లాటుఫారంమీాద పరుగెత్తా. 'ఠకీ' మని గోడతగిలింది బుఱ్ఱకి. తెలివొచ్చింది. అది కల—రాజు అత్తవారింటికెళ్లిపోతూన్నట్టు వచ్చింది. ఎంచేతంటే ఆ ఉదయాన్నే రాజమ్మ వెళ్లిపోయింది అత్తింటికి. మేమందరం ప్లాటుఫారం వరకూ వెళ్లాం కూడానూ! అదేకల మళ్లీ. కాని రాజుతో నిజంగా మాట్లాడేలేదు. అలావుంది నా ఆదుర్దా. మరి రాజు రాదేమో. ఎందుకు రాదు. ఎప్పుడూ రాకుంటే పండుగకైనా రాదా? పండుగకైతే అతన్నికూడా చూడొచ్చు. రాజు పండుక్కి వస్తూండడం వెళుతూండడం రెండేళ్ళు జరిగేయి. ఏడాదికోసారి వస్తే యుగానికోసారి వచ్చినట్టుండేది. వచ్చినప్పుడల్లా నన్ను చూడందే పోలేదు. కాని యిదివరకులా కలిసి మాట్లాడటం లేదు. నాకూ మొహమాటమే! ......వచ్చింది. మళ్లీ మామూలుగానే వచ్చింది. కాని యీసారి తానొక్కర్తే రాలేదు. ఇక్కడనుండి వాళ్లమ్మా వాళ్లనాన్నా వెళ్తే వాళ్లతో కలిసి వచ్చింది. వచ్చిందికాని నాకు అగుపడలేదు. చాలకాలం ఉండిపోయింది. మరి వెళ్లడం తలపుకూడా లేనట్టగుపిస్తున్నాది. నావిచార మేమిటంటే వచ్చిన తరువాత వొక్కసారైనా కంటపడలేదేమి అని. అసలు అత్తవారి ఊరునించి ఉత్తరమైనా రావటంలేదని మాయింట్లో అనుకోగా విన్నా. ఏమైనా చాలా సందేహంగానే ఉంది. ఈకులాసా ఖైదురాజుకి ఎందుకూ?

ప్రమాదవశముననో, నా అదృష్టవశముననో ఆవేళ రాజమ్మ నాకంటపడి మెరపుతీగలా మాయమైంది. కాని ఆఒక్క లిప్తలోనూ రాజులో ఎంతో మార్పు అగుపడింది. జబ్బు మనిషిలావుంది. అంతకంటే మరేం గ్రహించ డానికి వేళయెంతగనక! కొంపదీసి రాజమ్మ జీవితం విషాదాంతం కాలేదుగద!

మరికొంతకాలం పోయాక వా సవం అయిన సంగతి తెలిసింది. ఇసకతోటీ, రాళ్లతోటీ రప్పలతోటీ ఒకపెద్ద పరాగం రేగిందిట. ఆ ఝంఝామారుతం ధాటికి ఆగ లేక, చక్కగా చిగిర్చి పెద్దరసాల పాదపం కూకటివేళ్లతో సహా పడిపోయిందిట. నిరా ధారనిరంజనం అవడంచేత, అది మరి లేవ లేక పడిన స్థలంలోనే, కుములుతూ కుళ్లు తూ ఉండిపోయిందిట. అదిలేచి బాగుపడం కల్లోనివార్తట. అప్పుడు హృదయంలో సముద్రాలు కలతపెట్టేయి. ద్వాదశాది త్యులు పుట్టి హృదయం దగ్ధం చేస్తూన్నారా అనిపించింది. నాకు వర్ణనాతీతమైన, అవ్యక్త మైన బాధపట్టుకుంది. కాని ఒక్కొక్క ప్పుడు నాకు నవ్వువచ్చేది. ఎందుకో? కాని, నాదుఃఖం కాలమానస్థితిలో తగ్గుతూ వచ్చింది. కొంతకాలానికి అదృశ్యం అవు తుందేమో! అది ప్రకృతి తంత్రం. ఇంతకీ దైవేచ్ఛ అలా వున్నప్పుడు మానవమాత్రు లం ఏం చెయ్యగలం? కాని చెయ్యగలిసిన దొక్కటి ఉంది. ఒకవ్యక్తి బాధపడుతూ న్నప్పుడు, ఆవ్యక్తికి దైవసహాయంలేనప్పుడు, మానవుడన్నవాడైన ఓదార్చాలి, కొంత లోకొంత. మానవుడు సాధ్యమైనంతవరకూ ఆవ్యక్తికి బాధ తగ్గించడానికి ప్రయత్నిస్తే చాలు. అదే పదివేలు. ఆపాటి సహాయం మనసంఘం చెయ్యదా అనుకున్నా. సంఘం అంటే మనలాటి మానవసమితి కదా! మానవత్వంలేకుండా ఉంటుందా? అను కున్నా. ఒకవేళ అలా లేక, 'Adding insult to injury' అన్న ఫక్కీలో ఉంటే అది రాక్షసం. సంఘం ఏమంత వెఱ్ఱిదయితే కదూ!

ఆవేళ ఉదయాన్ని ఆరున్నరకి లేచి పెరట్లో పళ్లు తోముకుంటన్నా. పెరటిసందు లోంచి ఎవరో రాబోయి చప్పున వెళ్లిపోయి నట్టయింది. 'ఎవరు?' అని రెండుసార్లు అన్నా. కాని బదులులేదు. లేవబోతూంటే మా అమ్మ వెళ్లి చూసి 'నువ్వేనా? రా! రావచ్చు. కొత్తమొహాలు ఏమీలేవు', అంది. అప్పుడు ఓ వ్యక్తి ప్రవేసించింది. పోల్చుకోలేకపోయా. బాగా చూస్తే తెలి సింది. నా కళ్లని నేను నమ్మలేకపోయా. ఆ నిర్భాగ్యపు వ్యక్తి రాజమ్మ. ఈ రాజమ్మతో నేనా నేను చిన్నప్పుడు ఎంతో కలివిడిగా ఆడుకొనేవాడిని! ఆ దివ్యమంగళ విగ్రహాన్ని ఎందుకింత భయంకరంగా, వికృతంగా తయారుచేశారు? చిత్రకారుడు రాసిన, విచిత్రచిత్రంమీద, సిరాబుడ్డి ఒంపేస్తే ఎలా ఉంటుంది! అయ్యో రాజమ్మా! దురదృష్ట వంతురాలా! ఎత్తుగాలేచిపడుతూ, పీచికలలా జలజలలాడే ఆమెకురులపై, నల్లత్రాచు వలె పిరుదలదాకా వ్రేలాడే ఆమెజడపై

పాపిష్ఠి సంఘాని కింత కక్ష ఎందుకూ? పూర్తిగా జుత్తుతీసి వేయబడ్డది. ఆమె ముఖ కమలం వికృతంగా తయారయింది. అందాల చందమామ రాజమ్మ ఇప్పుడెలా ఉందో. సంఘ సంస్కార కర్తలు ఇలాంటి దౌర్జన్యం మాన్పడానికి ప్రయత్నించకపోతే, వారి ఉద్యమం యావత్తూ పొల్లు. పట్టుపరికిణీ కట్టుకొని, పట్టుజాకెట్టు తొడుక్కొని, జుట్టు బాగా దువ్వుకొని, ముఖచంద్రుడు వెన్నెల ఒలకపోస్తూంటే, వెండిపళ్ళెం పట్టుకొని, పువ్వులకోసం పెరట్లోకి వచ్చే రాజమ్మని చూసి మురిసిపోయిన కళ్లు, తెల్లపంచ కట్టుకొని, జుట్టులేక, కూలిపోయిన హృదయంతో, దేహం కృశించి, పువ్వులకోసం వచ్చిన రాజమ్మని చూసి అశ్రుపూరితాలయిపోయేయి. మొహం మీద పడుతూన్న మత్తపుష్పంధ మాలలాంటి ముంగురులు సవరించుకొనే లేత చేతులిప్పుడు ముసుకు సవరించుకుంటున్నాయి! ....ఇది చూచి సంఘం నవ్వుతోంది. ఇది దాని రాజ్యం—

ఆమె హృదయంలో పుట్టిన ఉజ్వల జ్వాలా మాలికలవేడి సంఘానికి తగలడం లేదూ? ఆమె వంటరిగా కార్చే కన్నీటి ప్రవాహంలో సంఘం, ఊపిరాడక, ఉక్కిరిబిక్కిరి కావటం లేదూ!

కర్షకా!

శ్రీ వి. వి. రామకృష్ణారావుగారు

గోవును పూర్వపుంజనులు గోమునపూజల సేయుచుంజనన్
నీవదిత్రోసి రాజనుచు నీదగులాభమె కోరుచున్వసన్
ద్రోవను మార్చుచున్నరుణఁ దాల్చకదానిని బాధఁద్రోతువే
గోవది దానిఁగావనిచో నేగతులుండవు కర్షకా ధరన్.

పాపములన్నిటన్ బశువు బన్నముపాలును సేయుచుండుటే
తాపము కల్గఁజేయునుగదా భగవంతున కెల్లభంగులన్
కోపముపూనకే పశువు క్షేమమెగోరెడి వాఁడవైనచో
నాపని నీకు నెల్లపుడు నందగఁజేయును బెక్కు సౌఖ్యముల్.

గోవును నమ్మియె మనవా రేవిధముగ ముక్తినొందిరో యారీతిన్
నీవును నర్మిలి జననన్ దైవము నిన్ననవరతము దయఁబ్రోచుఁగదే
నోరెఱుఁగని పశువులఁగడు కాఱియ వెట్టంగనేమి కర్జంబయ్యా!
పెరుగును నీపాపంబది మఱిమఱి బాధలనుబడెదు ముందున నింగిన్.

మానులకుగూడ దుస్సాధ్య మగుచునుండు ముక్తినొక భర్తృసేవచేఁ బొందునతివ
యటులె నీకల్పమగునావు నాదరించి పరమపదమును బడయుమో పతితజీవ.